# వాల్మీకి భార్య

'ఆడవాళ్ళకే అన్ని కష్టాలూ అన్నట్లు అందరి సానుభూతీ వాళ్ళ పట్లనే' అన్నాడు మారుతి విసుక్కుంటూ, ధుమధుమలాడుతూ.

తెల్లపోవడం నా వంతైంది. తుమ్మల్లో పొద్దు అంటారు అదుగో అలా ఉన్నది అతడిముఖం. ఎర్రగా కందిపోయి రుసరుసలాడుతూ, ఇతణ్ణెందుకు పలకరించాంరా బాబూ అనుకునేట్లు! ఎప్పుడైనా చూశారా తుమ్మచెట్ల గుంపులోంచి అస్తమిస్తున్న సూర్యబింబాన్ని?!

మారుతి ఈ మధ్య పదిహేను రోజులుగా అసలు కనిపించలేదు. కనిపిస్తేనూ తప్పుకొనిపోయే తప్పుపని నేనేమీ చేయనూలేదు. పైపెచ్చు నేను కనిపిస్తే మారుతి ముఖం చాటు చేసుకోకూడదు. చాటంత చేసుకోవాలి న్యాయంగా. దోసిలినిండా చిరునవ్వులు నిండి పక్కలకి పొర్లిపోతుండగా, ఒకటో రెండో ఇంకా పెదవులకి అతుక్కొనివుండగా నా ముందుకి వచ్చి, దండం పెట్టి పలకరించి సంతోషపడిపోవాలి. కాని ఇదేమిటి?

అదేం లేకపోగా రెక్కపుచ్చుకొని నేనే 'కాస్త ఆగవోయీ, ఈ మధ్య కనిపించి చాలా రోజులైంది' అనాల్సివచ్చింది, త్వరత్వరగా తప్పించుకొని పోదామనుకుంటున్న అతడి వాలకాన్ని అర్థం చేసుకోలేక. పాతబట్టకి ఎంత మంచిరంగు అద్దించినా కళకళలాడనట్లుగా ఉంది అతడి ముఖం.

నేనలాగా అతణ్ణి ఆ చిన్న పార్కులో కలుసుకొని పలకరించడం ఊహించలేదులా ఉంది మారుతి. అతడికది ఇష్టంలేదులా

ఉంది. అసలు నా పట్ల మారుతి ఎందుకు కృతజ్ఞుడైవుండాలంటారా? అదేం పెద్ద కథకాదు. మినీకథ. అతడికి రత్నమాలనిచ్చి వాళ్ళ వాళ్ళు పెళ్ళి చేయడానికి నేనేకారణం! అదా నే చేసిన తప్పు?!

ఆఫీసునుంచి సాయంకాలం రోజూ అటే నడుస్తాను నేను ఇంటికి. కాబట్టి కాసేపు ఆ చల్లనిచెట్లు చూస్తూ పువ్వులని పలకరిస్తూ ఆ పార్కులో ఆడుకునే చిన్నచిన్న బుజ్జిబుజ్జి పిల్లల్ని చూస్తూ ప్రతి రోజూ పావుగంటో అరగంటో గడిపి ఇక లేస్తాను.

కార్తీకం వచ్చేసిందిలా ఉంది అన్ని అందాలూ- అమరి అలంకారాలన్నీ పూర్తి అయిపోయిన పెళ్ళికూతురిలా ఉంది ఒక పున్నాగ లేత చెట్టు. ఈయేడే తొలిసారిగా పూసిందేమో అది. దానికింద తచ్చాడుతూ ఇద్దరు ముగ్గురు చిన్నారులు పూలేరుతూ కిలకిలాడుతున్నారు. ఆకాశంలో మెరిసే హరివిల్లు తమ కోసమే కాదా అనుకొని ఆనందించే అమాయకులు పిల్లలంటే. సృష్టిలోకల్లా అందమైన ప్రాణులు.

'ఏమిటి నీ బాధ' అన్నాను నేను కూడా కొంచెం గాంభీర్యం ప్రదర్శిస్తూ మారుతిని ఒకచోట కూలేసి.

'అవునండీ! మగవాడికేమీ చికాకులూ చీదరులూ కష్టాలూ నిష్ఠూరాలూ ఉండవా? ఆఫీసులుంటాయి. అసూయపడే సహచరులుంటారు. ఏవిధంగానైనా ఎదుటివాడి మనసు నొప్పిస్తే, కష్టపెడితే, అవతలవాణ్ణి బాధిస్తే, తమ అసూయనంతా ప్రదర్శించుకుంటే తమ జన్మ సార్థకమైపోయినట్లుగా ప్రవర్తించే మనుషులుంటారు. వీళ్ళతోనే, వీళ్ళమధ్యనే మనం బతకాలి కదా?' అని ఏదో విసవిసలాడాడు మారుతి.

'ఇదంతా ఏమిటి? విసుగు పుట్టించి 'బోర్' చేసే రచయితలాగా' అన్నాను నేను మధ్యలో కల్పించుకుంటూ.

'వినండి మరి! అధికారికి ఆపేక్షా దయ్యానికి దయా ఉండకూడదని ఒక చైనా సామెత. ఆఫీసుల్లో ఏ కష్టాలూ ఉండవనుకుంటారు ఈ ఆడవాళ్ళు. ముఖ్యంగా ఆఫీసుల్లో పనిచేయని ఆడవాళ్ళు. ఒకవేళ వాళ్ళకుండవేమో!' అంటూ నాబదులు తానే నాలుక కరుచుకున్నాడు. మారుతి మంచివాడు. చెడ్డమాటలు మాట్లాడడు.

'అది కాదండీ! నామనస్సంతా వికలమై చికాకనిపించి మొన్నొరోజున నేరుగా సినిమాకు వెళ్ళాను, అదంతకన్నా తలనొప్పి అని తెలుసుకోలేక. ఇదేదో మహాపరాధం లాగా మీరు నాకు కట్టబెట్టారు చూసారూ మెళ్ళోగుదిబండ, మూడురోజులు నన్ను సాధిస్తుందేమండీ! ఒక రోజున ఏం జరిగిందో తెలుసా? నేను సిగరెట్టు కాల్చానని తెలుసుకుందిట. అదో గొప్ప అపరాధం. నాతిచరామి భంగమై పోయినట్లు రుసరుసలాడింది. నాకు చాలా విసుగనిపిస్తుంది. ఒకవేళ నేను మూడీగా ఉంటే, గాభరాగా డీలా పడిపోయినట్లు ఉంటే ఎందుకలా ఉన్నారు? ఏమైంది? అని నెమ్మదిగా అడగవచ్చుకదా! అలా కాదట, ఎప్పుడూ నేనే తనను నానెత్తి కెక్కించుకోవాలిట. ఇదీ మీ మాట విన్నందుకు నా కొరిగిన సుఖం, హాయి, సౌఖ్యం.' అని నన్నే ఆ రత్నమాల అనుకుంటూ కొరకొర చూశాడు మారుతి. (కొరుక్కు తినడు కదా! కోపంతో?)

రత్నమాల మంచిపిల్ల. తెలివైంది. మరి ఎందుకిలా మగడనే పదార్థాన్ని అర్థం చేసుకోకుండా ప్రవర్తిస్తున్నదబ్బా, ఇలా బాధిస్తున్నది కదా అని విస్తుపోయాను.

'ఇది నీ మంచికేనయ్యా మారుతీ! మహాపురుషులందరికీ తమ తమ ప్రేమంపు ఇల్లాళ్ళవల్లనే జ్ఞానోదయమైంది. పరమకిరాతుడు పరమర్షి కావడానికీ, మహామేధావి సోక్రటీస్ తత్త్వవేత్తగా తరించడానికీ, అసలు ఈ విషయం తెలుసోలేదో మహానుభావుడు తులసీదాసు

రామాయణం రాయడానికి కారణం లేదా ప్రేరణం ఎవరో తెలిస్తే నీవింత బాధపడవు' అని సర్ది చెప్పాను నేను.

అతడి కర్థమైందో కాలేదో - ఎవరికి అర్థమైనా కాకపోయినా నే నప్పుడేం చెయ్యగలను గనక! ఎదురుగా చిన్న చిన్న చిన్నారులు పున్నాగపూల కాడలూదుతూ పూల రెక్కల చిరుబుడిపెలు బుగ్గల మీద టప్ టప్ లాడించుకుంటూ తుళ్ళింతలాడుతున్నారు.

టుప్‌టీక: అదండీ మారుతి అసహనగాథ! మహర్షి కాకపూర్వం రత్నాకరు డొక కిరాతుడు. దొంగ. దారులు కొట్టి ధనం తెచ్చేవాడు. 'నీ పాపంతో నాకూ నా పిల్లలకూ ఏమీ పనిలేదు. నీవు దోచి తెచ్చే సొమ్ము మాత్రమే మాకు కావాలి, రావాలి' అందిట ఆయనగారి ఇల్లాలు. అంతటితో బుద్ధి తెచ్చుకుని బోల్డు పశ్చాత్తాపపడి ఆ కిరాతుడు వాల్మీకి మహర్షి అయినాడుట. సోక్రటీస్ కూడా పెళ్ళాంగారి సాధింపులకు తట్టుకోలేక పెద్ద తత్త్వవేత్తగా మారిపోయినాడట.

తరుణీతరుణులు కాపురాల మూపురాలు తామొక్కరే భరిస్తున్నా మని అనుకోకూడదు. అర్థం చేసుకోవడం అని పెద్ద పెద్ద కబుర్లతో ఎదుటివారి గురించి భ్రమల పాలు కాకూడదు. అర్థం చేసుకోవడం - వన్‌వే ట్రాఫిక్ కాదు కదా! ఇద్దరూ అందుకు సన్నద్ధం కావాలి. వర్త మాన సమాజంలో ఎన్నో ఉద్రిక్తతలు - ఇవీ ఆలూ మగలూ ఇద్దరూ అర్థం చేసుకోవాలికదా? ఆడుతు పాడుతు అడుగేస్తుంటే అలుపూసొలుపే మున్నది - అనుకోవటం అందరి విషయాల్లోనూ సాధ్యమా? అలుపూ సొలుపూ వచ్చినప్పుడైనా కాస్త పట్టించుకోవాలి.

—ఆకాశవాణి ప్రసారితం-అభ్యుదయలోనూ ప్రచురితం-1979.